నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

'వద్దిరాజు'కు శుభాకాంక్షల వెల్లువ

ఖమ్మం/సత్తుపల్లి టౌన్/మధిర, ఫిబ్రవరి 15 : రాజ్యసభ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ తరపున గురువారం నామినేషన్ దాఖలు చేసిన వద్దిరాజు రవిచంద్రకు బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రవిచంద్ర తన రెండేళ్ల పదవీ కాలంలో ప్రజా సమస్యలపై తన వాణిని బలంగా వినిపించారని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతోపాటు జిల్లాలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఉన్న ఒక్క రాజ్యసభ సీటును బీసీ సామాజిక వర్గానికి ఇచ్చి న్యాయం చేయాలనే ఉద్దేశంతో వద్దిరాజుకు అవకాశం కల్పించి బీసీలపై కేసీఆర్ తన ప్రేమను చాటుకున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

పోలవరం బ్యాక్ వాటర్‌తో ముప్పు

మిగిలిన కరకట్ట నిర్మాణాన్ని పూర్తి చేయాలి

అసెంబ్లీలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, ఫిబ్రవరి 15 : వర్షాకాలంలో పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలం పట్టణానికి ముప్పు పొంచి ఉన్నదని, దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉన్నదని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022, జూలై 17న 70 అడుగుల మేర వరద ప్రవాహం నమోదైందని, దీంతో పట్టణంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కరకట్ట నిర్మించారన్నారు. మిగిలిన అర కిలోమీటర్ కరకట్ట నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.39 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారని గుర్తు చేశారు. అయితే ఆ టెండర్లను రద్దు చేయకుండా కరకట్ట నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అలాగే నాలుగు రాష్ట్రాల రోగులకు వైద్య సేవలు అందిస్తున్న భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, నర్సుల కొరత ఉన్నదని, వెంటనే ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

జేఈఈ మెయిన్‌లో గిరిజన బిడ్డల సత్తా

అభినందించిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 15 : ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన గురుకుల విద్యార్థులను గురుకులాల సమన్వయాధికారి టి.వెంకటేశ్వరరాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ప్రత్యేకంగా అభినందించారు. రీజియన్ పరిధిలో 258 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 114 మంది క్వాలిఫై అయ్యారు. దీంతో వారిని గురువారం అభినందించిన అనంతరం గురుకులాల సమన్వయాధికారి వెంకటేశ్వరరాజు మాట్లాడారు. విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ఐటీడీఏ పీవో అందించిన సలహాలు, సూచనలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. విద్యార్థులకు అంకితభావంతో పాఠాలు బోధించిన అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ మరో కారణమని పేర్కొన్నారు.

18న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పరీక్ష

భద్రాచలం, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ గురుకుల జూనియర్, ప్రతిభా కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 18న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సీవోఈ భద్రాచలంలో 2, యూఆర్‌జేసీ మణుగూరు, యూఆర్‌జేఎస్ కొత్తగూడెం, ఆర్‌జేసీ అంకంపాలెం, సీఈవో దమ్మపేట, ఈఎంఆర్ఎస్ భద్రాచలం, ఈఎంఆర్ఎస్ సింగరేణి, ఆర్డీసీ ఖమ్మం కేంద్రాల్లో సుమారు 381 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, ఆధార్ కార్డు, ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్నులు తెచ్చుకోవాలని, ఉదయం 8 గంటల వరకే తమకు కేటాయించిన గదుల్లో కూర్చోవాలని, పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని తెలిపారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

బోనకల్లు, ఫిబ్రవరి 15 : విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. చిరునోముల ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని, ప్రతి పాఠశాలలో 'మన ఊరు-మన బడి' పేరుతో ప్రత్యేక వనరులు కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే చదువుకుంటారని, వారికి అర్థమయ్యే విధంగా బోధించి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బంధం శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కనుమూరి వెంకటేశ్వరరావు, గరపాకుల రామకృష్ణ, హెచ్ఎం, ఉపాధ్యాయుడు సీతారామశాస్త్రి తదితరులు ఉన్నారు.

ఇసుకాసురుల ధనదాహం

- ఆంధ్రా నుంచి తెలంగాణకు జోరుగా రవాణా
- చక్రం తిప్పుతున్న ఆంధ్రాకు చెందిన కాంట్రాక్టర్లు
- బుధవారం అర్ధరాత్రి 17 ఇసుక లారీలను పట్టుకున్న మైనింగ్‌శాఖ
- ఘటన మరువకముందే కేశవాపురంలో మరో ఐదు లారీలు సీజ్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నది. డబ్బులకు కక్కుర్తి పడిన కొందరు అక్రమార్కులు కృత్రిమ కొరత సృష్టించి, వినియోగదారులకు ఎక్కువ ధరకు ఇసుక విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసుల కళ్లు గప్పి ఆంధ్రా నుంచి తెలంగాణకు గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలిస్తూ పబ్బం గడుపుకొంటున్నారు. బూర్గంపహాడ్ మండలంలో ఒక్క బుధవారం అర్ధరాత్రే అక్రమంగా ఇసుక తరలిస్తున్న 17 ఇసుక లారీలను మైనింగ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన మరువక ముందే గురువారం ఉదయం పాల్వంచ మండలం కేశవాపురంలో అధికారులు మరో ఐదు ఇసుక లారీలను పోలీసులు పట్టుకున్నారు. నామమాత్రపు నిఘా పెట్టి, నామమాత్రపు సంఖ్యలో వాహనాలను సీజ్ చేస్తూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు ప్రస్తుతం జిల్లాలో వినిపిస్తున్నాయి.



తెరుచుకోని ఇసుక రీచ్‌లు..

ప్రస్తుతం మణుగూరు, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపహాడ్ మండలాల్లోని ఇసుక రీచ్‌లు మూతపడడంతో జిల్లాలో ఇసుక కొరత ఏర్పడింది. ఒకప్పుడు ఈ రీచ్‌లు నడిచినప్పుడు ఒక ట్రక్కు ఇసుక వినియోగదారులకు కేవలం రూ.2 వేలకే లభించేది. ప్రస్తుతం రూ.4 వేలు పెట్టినా ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది.

ఐదు ఇసుక లారీల పట్టివేత

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 15: ఇసుకను ఆంధ్రా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు లారీలను పాల్వంచ రూరల్ పోలీసులు గురువారం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కేశవాపురం వద్ద పాల్వంచ రూరల్ ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రా నుంచి ఇసుక లోడుతో వెళుతున్న లారీలు పట్టుబడ్డాయి. ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఐదు లారీలను పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఆంధ్రా నుంచి తెలంగాణకు..

భద్రాచలం పట్టణానికి ఒకప్పుడు కూతవేటు దూరంలో ఉన్న గుండాల ప్రాంతం ఉమ్మడి ఖమ్మం పరిధిలో ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఆ గోదావరి పరీవాహక ప్రాంతం ఆంధ్రాలో విలీనమైంది. అక్కడి గోదావరి తీరం నుంచి ఆంధ్రాకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తవ్విస్తున్నారు. భద్రాద్రి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు రోజుకు 40 నుంచి 50 లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ప్రస్తుతం ఒక లారీ లోడ్ ఇసుకకు అక్రమార్కులు సుమారు రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. గుండాల నుంచి తెలంగాణకు వచ్చే ఏ ఇసుక లారీ అయినా భద్రాచలం పట్టణంలోని గోదావరి బ్రిడ్జి పైనుంచే రావాలి. పట్టణంలో అనేకచోట్ల చెక్‌పోస్టులు ఉన్నాయి. అలాగే బ్రిడ్జిపైనా మరో చెక్‌పోస్ట్ ఉన్నది. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా దందా కొనసాగుతున్నదంటే నిఘా వ్యవస్థ ఏ మేరకు పనిచేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిఘా వ్యవస్థను పటిష్టపరచాలని, అక్రమార్కుల ఆగడాలను కట్టడి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

అధికారుల వివరణ ఇలా..

ఇసుక దందాపై 'నమస్తే' గనులశాఖ ఏడీ జైసింగ్‌ను వివరణ కోరగా.. భద్రాద్రి జిల్లాలో పలుచోట్ల అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్న సంగతి వాస్తవమేనన్నారు. ప్రస్తుతం ఆయా వాహన డ్రైవర్లు పరారీలో ఉన్నారన్నారు. వాహన నంబర్ల ఆధారంగా యజమానులను గుర్తించే పనిలో ఉన్నామన్నారు. ఇసుక అక్రమ రవాణా నిగ్గు తేల్చే పనిలో తమ సిబ్బంది నిమగ్నమయ్యారని సమాధానమిచ్చారు. ఆర్టీవో వేణును వివరణ కోరగా.. మైనింగ్‌శాఖ అధికారులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సదరు వాహనాలకు అనుమతులున్నాయా, డ్రైవర్లు ఓవర్ లోడ్‌తో ఏమైనా సరకు తరలిస్తున్నారా.. వాహన యజమానుల వద్ద సరైన వాహన పత్రాలు ఉన్నాయా.. లేవా.. అనే అంశాలపై విచారిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన పత్రాలు లేకుంటే యజమానులపై చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి..

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేయాలి

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలని, అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద 24 గంటలపాటు వాహన తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై రెవెన్యూ, పోలీస్, అటవీ, మైనింగ్, టీఎస్ఎండీసీ, రవాణా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మణుగూరు, పినపాక మండలాల్లో వాహన తనిఖీలు చేపట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అనుమతి ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉంటుందని, అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక తీస్తే కఠిన చర్యలు చేపట్టాలని మైనింగ్, టీఎస్ఎండీసీ, రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. వాహనాలను తనిఖీ చేసేందుకు రూట్ మ్యాప్‌లు రూపొందించడంతోపాటు రూట్ టీములు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణా, అధిక లోడు వాహనాలను పట్టుకున్నట్లైతే సమాచారాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేయాలన్నారు. రాత్రి సమయాల్లో నిరంతరాయంగా పటిష్ఠ తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీవో విద్యాచందన, ఏఎస్పీ పరితోష్ పంకజ్, రవాణా శాఖ అధికారి వేణు, మైనింగ్ ఏడీ జైసింగ్, టీఎస్ఎండీసీ పీవో శ్రీనివాస్, సర్వే ఏడీ కుసుమకుమారి, డీఎస్పీలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

- శాఖాపరమైన లక్ష్యాలు సాధించాలి
- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- ఎంపీడీవోల సమీక్షలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఎంపీడీవోల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 15: శాఖాపరమైన లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తూ మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధిపై జిల్లాలోని ఎంపీడీవోలతో నూతన కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత నూతనంగా బదిలీపై జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బదిలీలు, ఉద్యోగోన్నతులు అనేవి ప్రతి ఉద్యోగికీ కొత్త జన్మ లాంటివని అన్నారు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఏ ప్రాంతానికి వెళ్లినా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఇప్పుడు సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున.. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉందని, ఈ క్రమంలో ఎంపీడీవోలపై ఎంతో బాధ్యత ఉంటుందని అన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులకు మార్గనిర్దేశం చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని సూచించారు. ఇది ఎన్నికల సమయమైనందున నిష్పక్షపాతంగా పని చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో లేబర్ టర్నోవర్ పెంచాలని సూచించారు. కొత్త పనులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రాజెక్ట్ రాస్తాలో భాగంగా గ్రామాల్లోని డొంకల ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించేందుకు దరఖాస్తుల పరిశీలనను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో వినోద్, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో హరికిషన్, వివిధ శాఖల జిల్లా అధికారులు చందన్‌కుమార్, శ్రీనివాసులు, చంద్రమౌళి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతులతోనే దిగుబడులు

కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని పలువురు శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం కొత్తగూడెం రేడియో కేంద్రం ఆధ్వర్యంలో కిసాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ ప్రోగ్రాం హెడ్ బైరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్లు డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, డాక్టర్ కే.రవికుమార్, జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.శిరీషలు మాట్లాడారు. మందుల పిచికారీ, కలుపుతీత, పంటల కోత, నూర్పిడి తదితర పనులకు అధునాతన వ్యవసాయ పరికరాలను వినియోగించాలన్నారు. నేల, భూసారాన్నిబట్టి అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను ఎంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆదర్శ, ఉత్తమ రైతులను ఆకాశవాణి అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉత్తమ అవార్డు గ్రహీత సత్యనారాయణ, ఆదర్శ రైతు అవార్డు గ్రహీత గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నూరి రాజశేఖర్, ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ కొలిపాక శంకర్‌రావు, బొల్లవరపు ప్రసాద్, శనగస్వామి, సాంకేతిక సిబ్బంది రెడ్డి, బాబుసింగ్, ప్రభాకర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. కిసాన్ దివస్ సందర్భంగా పలువురు రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులను ఘనంగా సన్మానించారు.

మాట్లాడుతున్న కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ

గని ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి
- సింగరేణి ప్రభావిత ప్రాంతవాసుల డిమాండ్
- టేకులపల్లి కేవోసీ-2లో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఆందోళన చేస్తున్న ప్రజలు

టేకులపల్లి, ఫిబ్రవరి 15: గని ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోయగూడెం గని ప్రభావిత ప్రాంతవాసులు డిమాండ్ చేశారు. టేకులపల్లి మండల పరిధిలోని సింగరేణి ఇల్లెందు ఏరియా కోయగూడెం ఉపరితల గని (కేవోసీ) పిట్-2 విస్తరణపై గురువారం కేవోసీ ప్రాజెక్ట్ కార్యాలయ ఆవరణలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. గని జనావాసాలకు చాలా దగ్గరగా ఉందని, బొగ్గు వెలికితీత కారణంగా తాము కాలుష్యం బారిన పడుతున్నామని ప్రజలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సింగరేణి యాజమాన్యం గని ప్రభావిత ప్రాంతాల్లో శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, ప్రతి నెలా గ్రామాల్లో ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గని ప్రభావిత గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించేందుకు సహకరిస్తామన్నారు. కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి పరిధిలో బొగ్గు డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించేందుకే యాజమాన్యం పిట్ విస్తరణకు పూనుకుంటున్నదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి రవీందర్, డీఎస్పీ రమణమూర్తి, సీఐలు టి.సురేశ్, రవీందర్, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీందర్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

- పని ఒత్తిడిని అధిగమించేందుకే ఆటల పోటీలు దోహదం
- 'ఖేలో భద్రాద్రి' క్రీడల ప్రారంభంలో ఎస్పీ రోహిత్‌రాజు
- రేపటి వరకూ క్రీడా పోటీలు: టీఎన్‌జీవోస్ నేత అమరనేని

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 15: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. నిత్యం విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించేందుకే ఆటలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. టీఎన్‌జీవోస్, జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో భద్రాద్రి జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రకాశం స్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవానికి ఎస్పీ రోహిత్‌రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఆరోగ్యానికేగాక మానసిక ఉల్లాసానికీ ఎంతగానో తోడ్పడుతాయని వివరించారు. ఈ ఆటల ద్వారా స్నేహభావం కూడా పెంపొందుతుందని అన్నారు. అనంతరం టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు మాట్లాడుతూ.. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, జిల్లా యువజన క్రీడల శాఖ సంయుక్తంగా 'ఖేలో భద్రాద్రి' పేరిట క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. మూడు రోజులపాటు ఈ క్రీడలు కొనసాగుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, నాలుగో తరగతి సిబ్బందికి ఈ నెల 17 వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ పోటీల్లో 295 టీములుగా ఉద్యోగులు పాల్గొంటున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం, టీఎన్‌జీవోస్ బాధ్యులు కే.సాయిభార్గవ చైతన్య, రామనర్సయ్య, వీరబాబు, సోమయ్య, ప్రకాశ్, జానిమియా, రమేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.